క్లుప్తంగా

పెంచికల్‌పేట్ ఎఫ్ఆర్‌వోగా అనిల్ కుమార్



ఎఫ్ఆర్‌వో అనిల్‌కుమార్

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ ఫారెస్టు రేంజ్ అధికారిగా అనిల్ కుమార్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రేంజ్ అధికారి సుధాకర్ మంచిర్యాల జిల్లాకు బదిలీ కాగా.. భద్రాద్రి జిల్లా నుంచి బదిలీపైన వచ్చిన అనిల్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. పెంచికల్‌పేట్, చేద్వాయి, డిప్యూటీ రేంజ్ అధికారులుగా జమీల్, ముసావీర్, గుండెపల్లి ఎఫ్ఎస్‌వోగా ఆస్మా, బీట్ అధికారులుగా శ్రవణ్, విజయలక్ష్మి, మనోహర్‌లు బాధ్యతలు స్వీకరించారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

కౌటాల: జిల్లాలోని ఆదివాసీ గ్రామాల్లో ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ మన్నెవార్ కొలవార్ సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు డబ్బా బాపు గురువారం కోరారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురుష్కరించుకొని ఏజెన్సీ గ్రామాల్లో జెండా ఎగరవేయాలన్నారు. ఆదివాసీలందరు ఐక్యమంతంగా ఉండి హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. కౌటాల మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో ఆదివాసీ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తామని, ఆదివాసీ నాయకులు, ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

పెంచికల్‌పేట్: మండలంలోని జిల్లెడ గ్రామంలో కుమురంభీం విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆదివాసీ నాయకులు గురువారం భూమిపూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ కోసం పోరాటం చేసి తన ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడికి మారుమూల గ్రామంలో విగ్రహం ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు పార్వెటి ఈశ్వరీబాయి, కుడ్మెత గురుదాస్, తలండి మధుకర్, మదుకర్, సత్యవన్, మారుతి, ధర్మయ్య, వసంత్, గుండాజీ, సంతోష్, భీమయ్య పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



బోనాలతో నృత్యం చేస్తున్న శివసత్తులు

దహెగాం: మండల కేంద్రంలో గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మదన పోచమ్మ ఆలయం వద్ద నుంచి బోనాలతో ఊరేగింపు చేపట్టారు. శివసత్తుల నత్యం ఆకట్టుకుంది. పోచమ్మ తల్లికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

జైనూర్: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీటీం ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో మహిళలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అమ్మాయిలు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేసేటప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సునీత, శ్రీలత పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఫాగింగ్ మిషన్



మూలన పడి ఉన్న ఫాగింగ్ మిషన్

లింగాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఫాగింగ్ మిషన్ నిరుపయోగంగా మారింది. గత కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షానికి డ్రెయినేజీల్లో, గుంతల్లో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందాయి. దీంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. అయినా పంచాయతీ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫాగింగ్ మిషన్ అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

‘కలుపు’ కలవరం..!

- పత్తి పంటలో పెరిగిన గడ్డి
- ఆందోళనలో అన్నదాత
- కూలీలకు పెరిగిన డిమాండ్

కెరమెరి: గడిచిన పక్షం రోజుల నుంచి ప్రతీరోజు వర్షం కురుస్తుండడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. పత్తి చేలల్లో కలుపు అధికమైంది. దారలు కూడా పొలాల్లో నడిచే వీలు లేకుండా మారాయి. పొలాల్లో నీరు నిలిచి ఉండడంతో పొలం పనులు కాస్త మందగించాయి. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 8194 మంది రైతులు ఉండగా.. 29,427 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా 24 వేల ఎకరాల్లో పత్తి వేశారు.

పెరిగిన గడ్డితో ఇబ్బందులు..

ప్రస్తుతం మండలంలో ఎటు చూసినా పత్తి పంట కనిపిస్తోంది. కానీ పత్తిలో గడ్డి మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం ఎప్పుడు పడితే అప్పుడు వర్షం కురవడంతో వ్యవసాయ పనులకు ఆటంకంగా మారింది. గుత్తాగా కలుపు తీసేందుకు ఒక ఎకరానికి రూ. 5 వేల నుంచి 8 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. రోజు కూలీ రూ. 300 నుంచి రూ.400 వరకు అడుగుతున్నారు. దీంతో ఏం చేయలో తోచక అనేక మంది రైతులు గడ్డి మందు పిచికారీ చేస్తున్నారు. ప్రారంభంలోనే రూ. వేలల్లో ఖర్చు పెడితే రానున్న రోజులు ఇంకెంత భారమవుతాయో అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కెరమెరి శివారులోని పత్తి చేనులో పెరిగిన గడ్డి

రుణాలు అందక..

మండలంలోని సుమారు 800 మంది వరకు కౌలు రైతులు ఉన్నారు. వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందక పోవడంతో అప్పులు చేసి పంటలు పండిస్తున్నారు. అలాంటివారు సాగు భారంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎలాగోలా సిడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ దుకాణదారుల నుంచి ఉద్దెరకు విత్తనాలు కొనుగోలు చేసి ఎరువులు తీసుకుంటున్నారు. ఇలాంటి సమయంలో నగదు రూపంలో డబ్బు దొరక్క ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

రేట్లు పెరిగాయి



ప్రస్తుతం కురుస్తున్న వానలకు పత్తి చేలల్లో గడ్డి పెరిగింది. దీంతో కూలీలు అధిక డిమాండ్ చేస్తున్నారు. రోజు కూలీ రూ.300–400 వరకు ఇవ్వాల్సి రావడంతో కష్టాలు తప్పడం లేదు. గుత్తాగా మాట్లాడితే రూ. వేలల్లో అడుగుతున్నారు. రైతులకు వ్యవసాయం భారంగా మారుతోంది. – ఆత్రం భీంరావు, పట్నాపూర్

చిమ్మచీకట్లో గ్రామ వీధులు

- వెలగని వీధి దీపాలు
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు



విద్యుత్ స్తంభానికి వెలగని బల్బు

లింగాపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో వీధిదీపాలు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాహదారులు వెంట ఆంధకారం అలుముకుంది. దీంతో ప్రజలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. సర్పంచ్‌ల పదవీ విరమణ అయినప్పటి నుంచి గ్రామాల సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రజలు రాత్రి వేళ నిత్యావసర సరుకుల కోసం దుకాణాన్ని వెళ్లాలంటేనే బయపడుతున్నారు. ఈ విషయం ప్రత్యేకాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరితే నిధులు లేవని సమాధానం ఇస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

మండలంలోని ప్రతి గ్రామంలో ఏక్కడ చూసినా కరేంట్ స్థంబాలకు కరేంట్ బల్బులు లేక బల్బులు వున్న నిరూపయోగంగా వుండటంతో పంచాయతీ ఆధికారులు వాటిని ఆమర్చకుండా విధులన్ని చీకటి మయంగా మారుతుంది.ఆధికారులు స్పందించి విధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నాము.

– బానోత్ ఆంబాజీ, పిక్లాతండా

అర్హులైన రైతులకు పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలి

రెబ్బెన: తుంగెడలో బెస్తవాడకు చెందిన 21 మంది రైతులకు పట్టా పాస్‌పుస్తకాలు ఇవ్వాలని బాధిత రైతులతో పాటు కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ రామ్మోహన్ రావును కలిసి వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తుంగెడ శివారులోని 423 సర్వే నంబర్‌లో సుమారు 42 ఎకరాల్లో 21 రైతు కుటుంబాలు తరతరాలుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. 2010– 11లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టా పాస్‌పుస్తకాలను సైతం జారీ చేసిందన్నారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ భూములను రైతులు సాగు చేయనీయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారని మండిపడ్డారు. ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందచేసిన ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేశ్, దేవాజీ, సోమయ్య, మాజీ జెడ్పీటీసీ సంతోష్, హరీష్, చిరంజీవిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్, రాజేష్, గోపి, అన్నాజీ, ఆనంద్‌రావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలి



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సోంబాయి



రింగన్‌ఘాట్‌లో నిర్వహిస్తున్న ర్యాలీ

కెరమెరి: పుట్టిన బిడ్డకు తల్లిపాలు (ముర్రుపాలు) తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని రింగన్‌ఘాట్‌లో గురువారం ర్యాలీ నిర్వహించారు. బిడ్డకు పాలిచ్చేటప్పుడు తల్లి శుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో శ్యామల, లింగుబాయి, శకుంతల, సుజాత, అమృత, గర్భిణులు, బాలింతుల పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగించాలని, దీంతో శిశువు అనారోగ్యాల బారిన పడకుండా ఉంటుందన్నారు. సూపర్‌వైజర్ కుమా రి, అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, సావిత్రి, పొచ్చుబాయి, నిర్మల, రత్నమాల, విజయలక్ష్మి పాల్గొన్నా రు.

అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు

లింగాపూర్: మండల కేంద్రంలోని గురువారం ప్రపంచ తల్లిపాలపై అంగన్‌వాడీ టీచర్లకు, ఆ యా వర్కర్లకు, గర్భిణులకు సూపర్‌వైజర్ సోంబాయి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సోంబాయి మాట్లాడుతూ.. పు ట్టిన బిడ్డకు గంటలోపు తల్లి ముర్రుపాలు తా గించాలన్నారు. తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరో ధక శక్తిగా ఉపయోగపడుతుందన్నారు. తల్లి పాల సంస్కృతిని ప్రోత్సహించాలని కోరారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్య సామర్థ్యాలు పెంచేలా బోధన చేయాలని మండల నోడల్ అధికారి గావుడే హన్మంతు అన్నారు. కౌటాల మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కౌటాల, గుండాయిపేట్, ముత్తంపేట పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు గురువారం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్)పై శిక్షణ ఇచ్చారు. ప్రాథమిక స్థాయి 3వ తరగతి విద్యార్థులకు తరగతిస్థాయి సామర్థ్యాలు పెంపొందించేందుకు అనుసరించాల్సిన ప్రణాళికల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌వోలు భాగ్యలక్ష్మి, శ్రీనివాస్, హెచ్ఎం నారాయణ సింగ్, సీఆర్పీలు ప్రకాశ్, దేవన్న, లాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

ఇసుక ట్రాక్టర్లు సీజ్



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లతో ఎస్సైసాగర్

వాంకిడి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆసిఫాబాద్ పెద్ద వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లను రెవెన్యూ సిబ్బందికి అప్పగించారు.

ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ బదిలీ

కెరమెరి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాగం పరుశు రాములు గురువారం మహబూబ్‌నగర్ జిల్లాలోని గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు. గడిచిన మూడేళ్ల కాలంలో కళాశాల ఎంతో ఉన్నతంగా ఎదిగింది. ఆయన రాకముందు అసౌకర్యాలతో ఉన్న కళాశాలలో అధికారులతో మాట్లాడి విద్యుత్, మురుగుదొడ్ల సౌకర్యం కల్పించారు. మూడేళ్లలో ఫస్ట్, సెకండ్ ఇయర్‌లో 9.5 ఉత్తీర్ణత శాతం సాధించారు. విద్యార్థులకు మెరుగైన విద్యనందించారు.

మౌలిక వసతులు కల్పించాలి

తిర్యాణి: సింగరేణి సంస్థ నిధులతో తిర్యాణి మండలంలోని మౌలిక వసతులు కల్పనకు కృషి చేయాలని తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు గెడం సుభాశ్ అన్నారు. గురువారం బెల్లంపెల్లి ఏరియా జీఎం రవి ప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుభాశ్ మాట్లాడుతూ.. నైపుణ్యత లేని యువకులకు శిక్షణ ఇప్పించి ఉద్యోగాలను కల్పించాలన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

రెబ్బెన: రెబ్బెన తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రామ్మోహన్‌రావును గురువారం మాజీ ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు వేర్వేరుగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని హనుమాన్ ఆలయం సమీపంలో గల కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు అమ్ముతున్న మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. గురువారం పట్టణంలోని సంఘం బస్తీకి చెందిన అబ్దుల్ సలీంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన న్యాస్ శిక్షణ

కెరమెరి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గడిచిన రెండు రోజులుగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై కొనసాగిన శిక్షణ గురువారం ముగిసింది. ఆయా పాఠశాలలకు చెందిన 75 మంది టీచర్లు పాల్గొన్నారు. తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం సంబంధించిన సబ్జెక్టులపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు బోధించే పద్ధతులపై, అనుసరించే విధివిధాలనాలపై విషయ నిపుణులు నరేశ్, వినీత్, సురేశ్, ప్రత్యేష శిక్షణ ఇచ్చారు. నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో తూచ తప్పకుండా అమలు చేయాలని ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ సూచించారు. కాంప్లెక్స్ హెచ్ఎంలు చంద్రశేఖర్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆడే ప్రకాశ్

ఎస్సీ వర్గీకరణపై సంబురాలు

కెరమెరి: సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటన చేయడంపై గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు పొర్ల వెంకటేశ్, రాజయ్య, చంద్రశేఖర్, వినేశ్, రాంచందర్, నరేశ్, శ్రీకాంత్, రాహుల్, వెంకటస్వామి, సంతోష్ పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా సుదీర్ఘ పోరాటం చేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాటానికి ఇప్పుడు ఫలితం దక్కిందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సంతోష్, లింగంపల్లి ప్రభాకర్, కోరాల రాజేందర్, గోగర్ల రాజేష్, గోపాలక్రిష్ణ, బొంగు నర్సింగరావు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఇచ్చిన నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఇప అశోక్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వర్గీకరణ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పెంచికల్‌పేట్: సుప్రీం కోర్టు ఎస్సీ ఉప వర్గీకరణపై తీర్పునివ్వడంతో మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం సంబురాలు జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాకేశ్, దుర్గేష్, వెంకటి, శంకర్, నగేశ్ పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బాధ్యతగా మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న సీఐ శ్రీనివాస్



బావిని పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఏపీవో

వాంకిడి: ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని సీఐ శ్రీనివాస్ అన్నారు. గురువారం పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చే పడుతున్న వనమహోత్సవంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతీ మొక్కనూ సంరక్షించాలని కోరారు. ఎస్సై సా గర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో వనమహోత్సవం

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో వనమహోత్సవం కార్యక్రమంలో భా గంగా ఎస్సై కొముర‌య్య గురువారం మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడు తూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. నాటిని ప్రతిమొ క్క నూ సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరి పైన ఉందని సూచించారు. ఏ ఎస్సై ప్రభాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షిస్తాం

కెరమెరి: వాచర్ల ద్వారా మొక్కలకు నీటిని అందిస్తామని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. గురువారం మండలంలోని జోడేఘాట్ గ్రామాన్ని సందర్శించారు. మ్యూజియం ఆవరణలో, ఖాళీ ఉన్న ప్రదేశాల్లో మొక్కలు నాటాలని గ్రా మస్తులను కోరగా.. నీటి కొరత వల్ల మొక్కలు చనిపోతున్నాయని అన్నారు. ఈజీఎస్ ని ధులతో నిర్మించిన బావి ఉందని, దానికి వి ద్యుత్ మోటారు అమర్చి మొక్కలను రక్షిస్తామని పే ర్కొన్నారు. ఆయన వెంట ఏపీవో మల్ల య్య, గ్రామ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బేషరతుగా క్షమాపణ చెప్పాలి



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: మహిళలపై అనుచితంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. గురువారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని అసెంబ్లీ సాక్షిగా అవమానించారని సిర్పూర్(టి) నియోజకవర్గ బీఆర్ఎస్ కన్వీనర్ లెండుగురె శ్యాంరావ్ అన్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, ఆవుల రాజ్‌కుమార్, ఓదేలు, మినాజ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రజాప్రతినిధులను గౌరవించాలి

జైనూర్: బీఆర్ఎస్ మహిళ ఎమ్మెల్యేను అవమానించిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాలాలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తోటి మహిళా ఎమ్మెల్యేను కించపర్చడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు మెస్రం అంబాజీ, తొడసం ధర్మారావు, గణపత్, మెస్రం రాహుల్, భూమన్న పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పరామర్శ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని రవిచంద్ర కాలనీలో జరిగిన అగ్ని ప్రమాద బాధితులను గురువారం డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాదరావు పరామర్శించారు. ప్రమాదంలో రూ. 50 వేల నగదు, బంగారం, వెండి కాలిపోయినట్లు బాధితురాలు చిన్నక్క వాపోయింది. నష్టపోయిన తమకు న్యాయం చేయాలని కోరగా, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. నాయకులు బాలేశ్వర్ గౌడ్, మసాదే చరణ్, కలీమ్, గోపాల్‌నాయక్, గంగారాం , తదితరులు ఉన్నారు.



పరామర్శిస్తున్న డీసీసీ అధ్యక్షుడు

పేకాట రాయుళ్ల అరెస్టు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లోని పేకాట స్థావరంపై గురువారం ఎస్సై ప్రవీణ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని రూ. 2100 స్వాధీనం చేసుకొని, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సతీశ్ తెలిపారు. ఎవరైనా పేకాట, మట్కా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.